



ఎయిర్‌పోర్టు ఫొటో గ్యాలరీని పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు



విమానాశ్రయ నిర్మాణంపై విలేకరులతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబునాయుడు

- అనుకున్న సమయం కన్నా ముందే పూర్తి చేస్తాం
- కేంద్ర విమానయానమంత్రి ఆ బాధ్యత తీసుకుంటారు
- ఉత్తరాంధ్ర అభివృద్ధే లక్ష్యం
- ఎన్నికల్లో చారిత్రక విజయం అందించారు
- ఈ ప్రాంత ప్రజల రుణం తీర్చుకుంటాం
- ఎకనమిక్ హబ్‌గా ఉత్తరాంధ్ర కానుంది
- యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తాం..
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

ఎయిర్‌పోర్టు పనుల్లో పరుగులు

విజయనగరం (ఆంధ్రజ్యోతి), జూలై 11:

భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు పనుల్లో పరుగులు పెట్టిస్తామని, 2026 జూన్‌కు ముందే పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించారు. కూటమికి చారిత్రక విజయం అందించిన ఉత్తరాంధ్ర ప్రజల కష్టాలు తొలగించి వారి రుణం తీర్చుకుంటామన్నారు. ఎయిర్‌పోర్టు నిర్మాణ పనుల ప్రగతిని సమీక్షించేందుకు గురువారం విజయనగరం జిల్లా భోగాపురం వచ్చిన సీఎంకు కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, కేంద్ర మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజు, రాష్ట్ర మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, గుమ్మిడి సంధ్యారాణి, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. తొలుత ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులను సీఎం పరిశీలించారు. ఫొటో గ్యాలరీ, నమూనాను పరిశీలించాక అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కేంద్ర విమానయాన మంత్రిగా గతంలో పనిచేసిన అశోక్ గజపతిరాజు పలు సలహాలు, సూచనలు అందించారు. అనంతరం చంద్రబాబు విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, 2026 జూన్ 30కు ముందే ఎయిర్‌పోర్టును పూర్తి చేయాలని అధికారులు, జీఎంఆర్ కన్‌స్ట్రక్షన్ వారికి ఆదేశించామన్నారు.



సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ అంబేడ్కర్

- 2015లో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేశామని, 2016 అక్టోబరులో కేంద్ర ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందన్నారు. అనంతరం రైతుల నుంచి 2,700 ఎకరాలు సేకరించామని, అన్నీ సజావుగా జరిగితే, 2023 నాటికే ఎయిర్‌పోర్టు వినియోగంలోకి రావాల్సి ఉందన్నారు. 2019లో బాధ్యతలు చేపట్టిన జగన్మోహన్‌రెడ్డి పిల్లచేష్టలు, పిచ్చి చేష్టలతో ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులు ముందుకు సాగలేదన్నారు. ఎయిర్‌పోర్టుకి తాను శంకుస్థాపన చేస్తే ఆయన తిరిగి శంకుస్థాపన చేశారన్నారు.
- తాజాగా ఎన్నికల్లో ఓట్ల సునామీ వచ్చిందని.. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఎన్డీయే కూటమికి ప్రజలు అఖండ విజయం అందించారన్నారు. కూటమికి ఎక్కువ సీట్లురావడంలో ఉత్తరాంధ్రదే అత్యంత కీలకమన్నారు. ఈ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్లాలన్న లక్ష్యంతో ఉన్నామన్నారు.
- ఎయిర్‌పోర్టు వినియోగంలోకి వస్తే ఉత్తరాంధ్ర ఎకనమిక్ హబ్‌గా తయారు కానుందన్నారు.



విమానాశ్రయం పనులపై నిర్మాణ సంస్థ ప్రతినిధులతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

ఉత్తరాంధ్రలో యువత ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయన్నారు. ఎయిర్‌పోర్టు నిర్మాణం ద్వారా ఎంతో మందికి ఉద్యోగ కల్పన జరగనుందన్నారు.

- ఉత్తరాంధ్ర వాసి అయిన జీఎంఆర్ ఈ ఎయిర్‌పోర్టు నిర్మాణం చేపట్టారని, గతంలో ఉత్తరాంధ్రకు చెందినవారైన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిగా పనిచేసిన అశోక్‌గజపతిరాజు ఈ ఎయిర్‌పోర్టు నిర్మాణాన్ని ఎంతో బాధ్యతగా తీసుకున్నారని, ఇప్పుడు అదే శాఖకు కేంద్ర మంత్రిగా రామ్మోహన్‌నాయుడు ఉండడం విశేషమన్నారు. నిర్మాణ పనులను పరుగులెత్తిస్తామన్నారు.
- తాను ప్రతివారం పోలవరం ప్రాజెక్టును సమీక్షిస్తున్నానని, అలాగే కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు కూడా ఈ ఎయిర్‌పోర్టు నిర్మాణాన్ని శరవేగంగా పూర్తి చేసేందుకు ఎప్పటికప్పుడు సమీక్షిస్తారని చెప్పారు. ఎయిర్‌పోర్టు నిర్మాణం ఒకవైపు జరుగుతుండగా, ఎయిర్‌పోర్టుకు వెళ్లే రహదారుల విస్తరణ తదితర అంశాలపైనా ప్రత్యేక దృష్టి సారించామన్నారు. జాతీయ రహదారికి ఆరు కిలోమీటర్ల దూరంలో ఎయిర్‌పోర్టు ఉందని, 12 చోట్ల మార్పులు, చేర్పులు చేసి జంక్షన్‌లను అభివృద్ధి చేయాల్సి వుందన్నారు. ఏ ఎయిర్‌పోర్టుకైనా కనెక్టివిటీ ముఖ్యమని, అప్పట్లో హైదరాబాదుకు ఔటర్ రింగురోడ్డు ఏర్పాటు చేశామని, ఎక్కడి నుంచైనా విమానాశ్రయానికి వేగంగా చేరుకునేలా కనెక్టివిటీ ఏర్పాటు చేశామని గుర్తు చేశారు.



సమీక్షలో సీఎం చంద్రబాబుతో మాట్లాడుతున్న అశోక్‌గజపతిరాజు

- ఎయిర్‌పోర్టు నిర్మాణ బాధ్యతలు జీఎంఆర్‌కి అప్పగించినప్పుడు వివిధ రకాల మోడల్స్‌ని తీసుకురావాలని కోరానని, అందులో భిన్నమైన మోడల్‌తో భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అంకురార్పణ చేశామన్నారు. తాగునీరు, విద్యుత్ తదితర సౌకర్యాల విషయమై ఎప్పటికప్పుడు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో చర్చించి, త్వరత్వరగా నిర్ణయాలు తీసుకుని పూర్తి చేస్తామన్నారు. ఎయిర్‌పోర్టు నిర్మాణం పూర్తయితే రాయఘడ్, కోరాపుట్, మల్కాన్‌గిరి, తూర్పుగోదావరి, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి తదితర ప్రాంతాలకు కనెక్టివిటీ విస్తృతంగా ఉంటుందన్నారు.
- తన పర్యటన షెడ్యూల్‌ను గమనిస్తే జిల్లాల పర్యటనలో మొదటిగా ఉత్తరాంధ్రకే వచ్చానని, తరువాత రాయలసీమకు వెళ్తున్నానన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టుకు సమాంతరంగా రాష్ట్రంలో మరోఐదారు ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు.
- భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుకు పీవీజీ రాజు ఎయిర్‌పోర్టుగా నామకరణం చేయాలని పలువురు ప్రజాప్రతినిధులు చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు. సీఎం చంద్రబాబు వెంట ఎమ్మెల్యేలు కళావెంకటరావు, కోళ్ల లలితకుమారి, అదితిగజపతిరాజు, కోండ్రు మురళీమోహన్, లోకం నాగమాధవి, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, పార్టీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మంనాయుడు, కలెక్టర్ అంబేడ్కర్, జాయింట్ కలెక్టర్ కార్తీక్, ఆర్‌డీవో సూర్యకళ తదితరులు ఉన్నారు.

అమరుడైన సైనికుడు

- తమ్ముడు కుమారుడి బారసాల రోజే ఘటన
- మృతుడు బాడంగి మండలం బొత్సవానివలస వాసి



గొట్టాపు శంకర్ (ఫైల్)

బాడంగి/బొబ్బిలి జూలై 11:

ఆ ఇంట అందరూ శుభకార్యం హడావిడిలో ఉన్నారు. చిన్నారి బారసాల సందడిలో నిమగ్నమ య్యారు. చుట్టాలు, బంధువులతో ఇళ్లంతా కోలాహలంగా ఉంది. అంతలోనే గుండెలను మెలిపెట్టే దుర్వార్త తెలిసింది. కాసేపట్లో శుభకార్యం తంతు ముగుస్తుందనగా ఆర్మీ విధుల్లో ఉన్న ఆ చిన్నారి పెద్దనాన్న అనుకోని ప్రమాదంలో చిక్కుకుని మృతిచెందినట్లు తెలిసింది. విజయనగరం జిల్లా తెర్లాం మండలం నందబలగలో గురువారం సాయంత్రం ఒక్కసారిగా విషాదం అలుముకుంది. బాడంగి మండలం బొత్సవానివలస గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ గొట్టాపు శంకర్ (38) గురువారం ఉదయం 10.30 గంటల సమయంలో జమ్ముకాశ్మీర్‌లోని లడక్ ప్రాంతంలో గ్యాస్ సిలిండర్ పేలి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ విషయం కుటుంబ సభ్యులకు సాయంత్రానికి తెలిసింది.

శంకర్ 2005లో ఆర్మీలో చేరాడు. జమ్మూకాశ్మీర్‌లోని లడక్‌లో బ్రిగేడ్ వర్క్‌షాపులో వెల్డింగ్ విభాగంలో పనిచేస్తున్నాడు. పిల్లల చదువు కోసం భార్య, పిల్లలు విశాఖలో ఉంటున్నారు. కాగా గురువారం వెల్డింగ్ పనులు చేస్తుండగా గ్యాస్‌సిలిండర్ పేలిపోయింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన శంకర్ అక్కడి కక్కడే మృతిచెందాడు. అధికారులు సాయంత్రానికి సమాచారం అందించారు. శంకర్‌కు ఇద్దరు తమ్ముళ్లు. పెద్ద తమ్ముడు శ్రీరాములు కుమారుని బారసాల కార్యక్రమం గురువారం తెర్లాం మండలం నందబలగలో జరిగింది. విశాఖలో ఉంటున్న శంకర్ భార్య కోమలత ఈ శుభకార్యానికి హాజరైంది. ఆ సందడిలో ఉండగా తన భర్తకు సంబంధించిన దుర్వార్త ఆమె వినాల్సి వచ్చింది. ఇతర కుటుంబ సభ్యులంతా కన్నీరుమున్నీరుగా విలపించారు. మరో ఆరునెలల్లో పదవీ విరమణ చేసి ఇంటికి వచ్చేద్దామనుకుంటున్న తరుణంలో ఈ విషాదం చోటుచేసుకుంది. శంకర్ కుటుంబం విశాఖలోని ఆదర్శనగర్‌లో నివాసముంటోంది. మూడోతరగతి చదువుతున్న 9 ఏళ్ల దివ్యాన్షిక, రెండో తరగతి చదువుతున్న ఏడేళ్ల జయంత్‌నాయుడు ఉన్నారు. తండ్రి అప్పలనాయుడు, తల్లి సావిత్రమ్మకు శంకరే పెద్ద కొడుకు. మృతదేహాన్ని శనివారానికి బొత్సవానివలసకు రప్పించేందుకు ఆర్మీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అధికారిక లాంఛనాలతో గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం

- హాజరుకానున్న కూటమి ప్రభుత్వ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీ

విజయనగరం (ఆంధ్రజ్యోతి):

జడ్పీ సర్వసభ్య సమావేశం ఈసారి పాత, కొత్త సభ్యులతో జరుగనుంది. రెండు ప్రధాన పార్టీలకు చెందిన పాత-కొత్త ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు. కలెక్టర్ అంబేడ్కర్ అధ్యక్షతన శుక్రవారం జడ్పీ సమావేశ మందిరంలో జరిగే సమావేశానికి జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుతోపాటు విజయనగరం ఉమ్మడి జిల్లాల నుంచి కూటమికి చెందిన మంత్రులు కొండపల్లి శ్రీనివాసరావు, గుమ్మిడి సంధ్యారాణి, ఎంపీ, ఎమ్మెల్యేలు, హాజరుకానున్నారు. గడిచిన మూడు నెలల్లో రాజకీయంగా పరిస్థితి తారుమారు అయ్యింది. గత సర్వసభ్య సమావేశంలో పాలకవర్గం అంతా వైసీపీకి చెందిన వారే ఉన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు అంతా వారే కావడంతో జడ్పీలో వారు చెప్పిందే రూల్ అన్నట్లు సాగింది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ప్రజలు అద్వితీయ విజయాన్ని ఇచ్చారు. వారంతా ఈ సమావేశానికి రానున్నారు.

- సమావేశంలో వ్యవసాయం, విద్యుత్, వైద్య ఆరోగ్యశాఖ, విద్య, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ రహదారుల పరిస్థితి, గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు ఇలా పలు అంశాలపై చర్చించనున్నారు. రక్షిత నీటి పథకాలు, ఇరిగేషన్ ప్రాజెక్టులు, రైతులకు విత్తనాలు, ఎరువుల పంపిణీ తదితర వాటిపై సభ్యులు ప్రశ్నించే అవకాశం ఉంది. జొన్నాడ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన టోల్‌గేట్‌ను ఎత్తివేయాలని ఇరు జిల్లాల ప్రజలు కోరుతున్నారు. ఈ అంశం చర్చకు రావొచ్చు.

రూ.160కే కిలో కందిపప్పు

- రైతు బజార్లలో అందుబాటులోకి తెచ్చిన ప్రభుత్వం

శృంగవరపుకోట జూలై 11:

కిలో కందిపప్పు (దేశవాళి) రూ.160కే రైతుబజార్లలో లభ్యం కానుంది. దీంతో పాటు స్టీమ్, బీపీటీ, సోనామసూరి రకం బియ్యం కిలో రూ.49, పచ్చి, బీపీటీ, సోనామసూరి రకం బియ్యం కిలో రూ.48కు పొందవచ్చు. ఈమేరకు ప్రజాప్రతినిధులు గురువారం రైతుబజార్లలో వీటి అమ్మకాలను ప్రారంభించారు. జిల్లాలో శృంగవరపుకోట, విజయనగరం ఆర్‌అండ్‌బీ, రింగురోడ్, మహారాజా ఆసుపత్రి, గంట్యాడ మండలం కోటారుబల్లి, చీపురుపల్లి, రాజాంలో రైతుబజార్లు వున్నాయి. చీపురుపల్లి, రాజాం మినహా మిగిలినవన్నీ బాగా నడుస్తున్నాయి. ఇటు కూరగాయాల దుకాణాలతో పాటు కిరాణాదుకాణాల్లోనూ ఈ రైతుబజార్ల నుంచి వినియోగదారులు సరుకులు తీసుకెళ్తుంటారు. దీంతో ఈ ఐదు రైతుబజార్లలో మొదటి దశగా బహిరంగ మార్కెట్‌లో కంటే తక్కువ ధరకు కందిపప్పు, నాణ్యమైన బియ్యం విక్రయించేందుకు పౌరసరఫరాల శాఖ ముందుకు వచ్చింది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో దేశవాళి కందిపప్పు రూ.181, స్టీమ్డ్ బీపీటీ, సోనామసూరి బియ్యం రకం రూ.55.85, పచ్చి, బీపీటీ, సోనామసూరి రకం రూ.52.40కు అమ్ముతున్నారు. పేద, మధ్య తరగతి ప్రజలకు ఆర్థిక భారం అవుతుండడం గుర్తించిన కూటమి ప్రభుత్వం రైతు బజార్లతో పాటు పెద్ద సంస్థాగత రిటైల్ దుకాణాల వద్ద సరసమైన ధరలతో నాణ్యమైన సరుకులు అందించాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌లు ఈమేరకు పౌరసరఫరాల శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.



కిలో కందిపప్పును తూస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

- 2014 నుంచి 2019 వరకు అధికారంలో వున్న టీడీపీ ప్రభుత్వం కిలో రూ.66కు చౌకధరల దుకాణాల ద్వారా కందిపప్పును అందించేది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం చౌకధరల దుకాణాల్లో కందిపప్పు పంపిణీకి మంగళం పాడేసింది. అప్పుడప్పుడు సరఫరా చేసినప్పటికీ అందరికీ అందేది కాదు.

నిర్లక్ష్యం

- ముందుకు సాగని తోటపల్లి కాలువల పనులు
- ఐదేళ్లలో వైసీపీ చేసింది శూన్యం
- కుడి ప్రధాన కాలువ నిర్వహణ గాలికి..



పొదలతో నిండిపోయిన తోటపల్లి కుడి ప్రధాన కాలువ

(చీపురుపల్లి)

ఐదేళ్లయినా తోటపల్లి కాలువల పనులు అంగుళం కూడా ముందుకు సాగలేదు. అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం పిల్ల కాలువలకు సంబంధించి లెక్కలేనన్ని హామీలు గుప్పించింది. ఒక్కటీ అమలు కాలేదు. కుడి ప్రధాన కాలువ నిర్వహణను కూడా అధికారులు గాలికి వదిలేశారు. పూడికతీతకు నోచుకోక, తుప్పలు తొలగించక కాలువ పరిస్థితి అధ్వానంగా మారింది. దీంతో తోటపల్లి జలాలు శివారు పొలాలకు చేరడం లేదు.

2015 సెప్టెంబరు 11న తెలుగుదేశం ప్రభుత్వం తోటపల్లి ప్రాజెక్టును జాతికి అంకితం చేసింది. కాలువల నిర్మాణాలు కొలిక్కివస్తున్న సమయంలో ప్రభుత్వం మారిపోయింది. దీంతో గత ఐదేళ్లు ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురయ్యాయి. కుడి ప్రధాన కాలువ కింద అవసరమైన చోట్ల పిల్ల కాలువలు నిర్మించి ఆయకట్టుకు నీరందిస్తామని వైసీపీ ప్రభుత్వం పలుమార్లు ప్రకటించినప్పటికీ నెరవేర్చలేదు. ఈ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి బొత్స సత్యన్నారాయణ పిల్ల కాలువల నిర్మాణంపై పలు ప్రకటనలు చేశారు. జిల్లా స్థాయిలో సమీక్షలు ఏర్పాటు చేసి పనులు త్వరితగతిన పూర్తిచేయాలని కూడా అధికారులను ఆదేశించారు. ఐదేళ్లయినా మంత్రి ఆదేశాలు అమలు కాలేదు. కొత్త పిల్ల కాలువల నిర్మాణం విషయంలో ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉంది. వెరసి విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన ఆయకట్టుదారులకు న్యాయం జరగడం లేదు.

- తోటపల్లి జలాశయం కుడి ప్రధాన కాలువ ద్వారా విజయనగరం జిల్లాలోని 13 మండలాల్లో సుమారు 47 వేల ఎకరాలు, శ్రీకాకుళం జిల్లాల్లోని 7 మండలాల్లో 64 వేల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. కాలువ పనులు పూర్తి కావడంతో 2015లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రాజెక్టును ప్రారంభించారు. దీంతో రైతులంతా సంబరాలు చేసుకున్నారు. అయితే సంవత్సరాలు గడుస్తున్నా పొలాలకు నీరందించాల్సిన ప్రధాన పిల్ల కాలువలు, చిన్న పాటి కాలువల పనులు ముందుకు సాగలేదు. దీంతో ఐదేళ్లుగా చాలా ప్రాంతాల్లోని రైతులు కుడి ప్రధాన కాలువకు ఎక్కడపడితే అక్కడ గండ్లు కొట్టి తమ ప్రాంతాల్లోని చెరువులకు నీరందే ఏర్పాట్లు చేసుకున్నారు.

పూర్తి కాని లైనింగ్ పనులు

కుడి ప్రధాన కాలువ తవ్వకం పూర్తయి సంవత్సరాలు గడుస్తున్నా.. కాలువలో లైనింగ్ పనులు ఇంకా మొదలు కాలేదు. దీంతో ప్రధాన కాలువ పొదలతో నిండిపోయింది. నీటి పారుదలకు ఆటంకం కలిగేలా పెరిగిపోయాయి. వీటిని తొలగించి వెంటనే లైనింగ్ పనులు ప్రారంభించాలని ఆయకట్టుదారులు డిమాండ్ చేస్తున్నారు.

దయనీయం

- వర్షాల్లేక ట్యాంకర్‌తో నారు తడుపుకుంటున్న రైతులు



మదుపాడలో నారుకు ట్యాంకర్లతో నీటి తడి అందిస్తున్న రైతు

గజపతినగరం, జూలై 11: వాన జాడ లేక రైతన్నలు తీవ్ర నిరాశ నిస్పృహల్లో కొట్టుమిట్టాడుతున్నారు. జూలై నెల వచ్చి పది రోజులైనా చినుకు పడకపోవడంతో వరి విత్తనాలు వేసి నింగివైపు చూస్తున్నారు. చెరువుల్లోనూ నీరు లేక ట్యాంక్‌ల ద్వారా నీరు తెచ్చుకొని నారును కాపాడుకొనే ప్రయత్నాలు చేస్తున్నారు. వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి, గంట్యాడ, జామి మండలాలతో పాటు మెంటాడ మండలానికి సంబంధించి 23,264 హెక్టార్లలో వరి సాగు చేపడుతున్నారు. మూడు నెలలుగా వర్షాలు లేక తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు.

నారును కాపాడుకోవ డానికి చాలా వ్యవప్రయాసలు పడుతున్నారు. బావుల్లోని నీటిని ట్యాంకులకు పట్టి తెచ్చుకుంటున్నారు. ట్యాంకర్ నీటిని తీసుకువచ్చేందుకు దూరాన్ని బట్టి రూ.500 నుంచి రూ.1000 వరకు ఖర్చు పెట్టాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. మరో పది రోజులు ఇదే పరిస్థితి కొనసాగితే నారు ఎండిపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దిక్సూచి
DIKSUCHI

ఎన్‌జీ రంగా వర్సిటీలో బీఎస్సీ ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్

గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ(ఏఎన్‌జీఆర్‌ఏయూ)- బీఎస్సీ ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. అకడమిక్ మెరిట్ ఆధారంగా లాంలోని కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్‌లో అడ్మిషన్స్ ఇస్తారు. ఈ కాలేజీకి ఐకార్ గుర్తింపు ఉంది. మొత్తం 83 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థుల కోసం 10 శాతం సూపర్ న్యూమరరీ సీట్లు నిర్దేశించారు. గ్రామీణ అభ్యర్థుల కోసం 40 శాతం సీట్లు ప్రత్యేకించారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన పురుషులు, మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చు. హాస్టల్ సౌకర్యం ఉంది.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి బైపీసీ/ఎంపీసీ/ఎంబైపీసీ గ్రూప్ సబ్జెక్టులతో ఇంటర్/ పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.

- మూడేళ్ల వ్యవధి గల డిప్లొమా(హోం సైన్స్) ఉత్తీర్ణులైన అభ్యర్థుల కోసం పది శాతం సూపర్ న్యూమరరీ సీట్లు(ఎనిమిది సీట్లు) ప్రత్యేకించారు. గ్రామీణ అభ్యర్థులకు కేటాయించిన సీట్లకు అప్లయ్ చేసుకోవాలంటే ఒకటోతరగతి నుంచి ఇంటర్ స్థాయి వరకు కనీసం నాలుగేళ్లు గ్రామ పాఠశాలల్లో చదివి ఉండాలి. సంబంధిత



ధ్రువపత్రాన్ని సబ్మిట్ చేయాల్సి ఉంటుంది.
- అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 25 ఏళ్లు; దివ్యాంగులకు 27 ఏళ్లు మించకూడదు.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.2,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **పోస్ట్ ద్వారా దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** జూలై 29
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** రిజిస్ట్రార్, ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, లాం, గుంటూరు - 522034
- **వెబ్‌సైట్:** angrau.ac.in

ఇగ్నోలో ఓడీఎల్ కోర్సులు

న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ(ఇగ్నో)- ఓపెన్ డిస్టెన్స్ లెర్నింగ్(ఓడీఎల్) కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. పీజీ, డిగ్రీ, డిప్లొమా, సర్టిఫికెట్ తదితర కోర్సులు ఉన్నాయి. ప్రోగ్రామ్‌లకు నిర్దేశించిన అర్హతల సమాచారాన్ని వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

అడ్వాన్స్‌ సర్టిఫికెట్ ప్రోగ్రామ్: ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు. ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ, పవర్ డిస్ట్రిబ్యూషన్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

అప్రిసియేషన్ కోర్సు: కోర్సు వ్యవధి మూడు నెలలు.

సర్టిఫికెట్ ప్రోగ్రామ్: ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు.

డిప్లొమా: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. బిజినెస్ ప్రాసెస్ అవుట్ సోర్సింగ్, క్రియేటివ్ రైటింగ్ ఇన్ ఇంగ్లీష్, డెయిరీ టెక్నాలజీ, ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్, ఫ్యాషన్ డిజైన్ అండ్ రిటైల్, హార్టికల్చర్, మీట్ టెక్నాలజీ, మోడరన్ ఆఫీస్ ప్రాక్టీస్, న్యూట్రిషన్ అండ్ హెల్త్ ఎడ్యుకేషన్, పారాలీగల్ ప్రాక్టీస్, థియేటర్ ఆర్ట్స్, టూరిజం స్టడీస్, ఉర్దూ, వాల్యూ ఎడ్యుకేషన్, వాటర్‌షెడ్ మేనేజ్‌మెంట్, ఉమన్ ఎంపవర్‌మెంట్ అండ్ డెవలప్‌మెంట్, అగ్రికల్చరల్ అండ్ కాస్ట్ మేనేజ్‌మెంట్, అప్పారెల్ మర్చండైజింగ్, రిటైలింగ్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

డిగ్రీ ప్రోగ్రామ్‌లు: బీఏ, బీఏ ఆనర్స్, బీబీఏ, బీసీఏ, బీఎస్సీ, బీఎస్సీ ఆనర్స్, బీకాం, బీఎస్‌డబ్ల్యూ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్సెస్ వ్యవధి ఏడాది.

పీజీ ప్రోగ్రామ్‌లు: ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకాం, ఎంటీటీఎం, ఎంబీఏ, ఎంసీఏ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఎంఎల్ఐఎస్ ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది.

పీజీ డిప్లొమా: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. అనలిటికల్ కెమిస్ట్రీ, కౌన్సెలింగ్ అండ్ ఫ్యామిలీ థెరపీ, గాంధీ అండ్ పీస్ స్టడీస్, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ, యానిమల్ వెల్ఫేర్, అప్లయిడ్ స్టాటిస్టిక్స్, ఆడియో ప్రోగ్రామ్ ప్రొడక్షన్, బుక్ పబ్లిషింగ్, కార్పొరేట్ అండ్ సోషల్ రెస్పాన్సిబిలిటీ, డెవలప్‌మెంట్ స్టడీస్, డిస్టెన్స్ ఎడ్యుకేషన్, ఎడ్యుకేషనల్ టెక్నాలజీ తదితర స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

పీజీ సర్టిఫికెట్: ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు. అగ్రికల్చర్ పాలసీ, క్లయిమేట్ ఛేంజ్, జియో ఇన్ఫర్మాటిక్స్, ఇండస్ట్రియల్ సేఫ్టీ, ఇన్వెంటరీ ప్లానింగ్ అండ్ వేర్ హౌసింగ్ సిస్టమ్ ఫర్ ఇంజనీర్స్, మలయాళం-హిందీ ట్రాన్స్‌లేషన్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 15
- **వెబ్‌సైట్:** ignouadmission.samarth.edu.in

ఎన్‌పీటీఐలో పీజీ డిప్లొమాలు

ఫరీదాబాద్‌లోని నేషనల్ పవర్ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్(ఎన్‌పీటీఐ)- పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. నిబంధనల ప్రకారం కోర్సులు పూర్తిచేసినవారికి ప్లేస్‌మెంట్స్ కల్పిస్తారు. మహిళలకు ప్రోగ్రామ్ ఫీజులో పది శాతం రాయితీ లభిస్తుంది. పవర్ సంస్థలు స్పాన్సర్ చేసే అభ్యర్థుల కోసం 25 శాతం సీట్లు కేటాయించారు. అకడమిక్ మెరిట్ ఆధారంగా మెరిట్ లిస్ట్ రూపొందించి కౌన్సెలింగ్‌ల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

పీజీ డిప్లొమా ఇన్ పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్: కోర్సు వ్యవధి ఏడాది. ఫరీదాబాద్, నాగ్‌పూర్, నైవేలీ, దుర్గాపూర్, అలప్పుజా, శివ్‌పురి సెంటర్లలో ఈ ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. ఒక్కో సెంటర్లో 60 సీట్లు చొప్పున మొత్తం 360 సీట్లు ఉన్నాయి.

పీజీ డిప్లొమా ఇన్ హైడ్రో పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్: కోర్సు వ్యవధి తొమ్మిది నెలలు. నంగల్ సెంటర్లో ఈ ప్రోగ్రామ్ ఉంది. ఇక్కడ 60 సీట్లు ఉన్నాయి.

పీజీ డిప్లొమా ఇన్ రెన్యూవబుల్ ఎనర్జీ అండ్ గ్రిడ్ ఇంటర్ఫేస్ టెక్నాలజీస్: కోర్సు వ్యవధి ఏడాది. న్యూఢిల్లీ, శివ్‌పురి, నైవేలీ, అలప్పుజా సెంటర్లలో ఈ ప్రోగ్రామ్ ఉంది.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో (బీఈ/బీటెక్)(మెకానికల్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/సీ అండ్ ఐ/పవర్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులై ఉండాలి. రెన్యూవబుల్ ఎనర్జీ అండ్ గ్రిడ్ ఇంటర్ఫేస్ కోర్సుకు ఏ ఇంజనీరింగ్ విభాగంవారైనా దరఖాస్తు చేసుకోవచ్చు. గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేవు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 28
- **టెలిఫోనిక్ ఇంటర్వ్యూ:** జూలై 30, 31
- **అభ్యర్థుల మెరిట్ లిస్ట్ విడుదల:** ఆగస్టు 2
- **కౌన్సెలింగ్:** ఆగస్టు 5, 6
- **కోర్సులు ప్రారంభం:** ఆగస్టు 12 నుంచి
- **మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్స్:** ఆగస్టు 22
- **వెబ్‌సైట్:** www.npti.gov.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/V9yZi4uలో చదవండి.

సెప్టెంబర్ ఒకటిన బాలకృష్ణకు భారీ సన్మానం



'తాతమ్మ కల' (1974) చిత్రంతో తన నట జీవితాన్ని ప్రారంభించారు నందమూరి బాలకృష్ణ. వైవిధ్యమైన పాత్రలు పోషిస్తూ 50 ఏళ్లుగా హీరోగా కొనసాగుతున్న ఏకైక కళాకారుడు ప్రపంచంలో ఆయన ఒక్కరే అంటే అది అతిశయోక్తి కాదు. అంతేకాదు తండ్రి, మహానటుడు ఎన్టీఆర్ మార్గాన్ని అనుసరించి రాజకీయాల్లోకి ప్రవేశించి హిందూపురం నియోజక వర్గం నుంచి మూడు సార్లు వరుసగా శాసనసభ్యుడిగా ఎన్నికై హ్యాట్రిక్ సాధించారు. ఇలా సినీరంగంలోనూ, రాజకీయ రంగంలోనూ సత్తా చాటుతూ 50 ఏళ్ల కెరీర్ పూర్తి చేసుకున్న బాలకృష్ణను తెలుగు చిత్రపరిశ్రమ సెప్టెంబర్ ఒకటిన ఘనంగా సత్కరించనుంది. ఈ మేరకు తెలుగు నిర్మాతలమండలి కార్యదర్శి దామోదర ప్రసాద్, నిర్మాతలమండలి కార్యదర్శి ప్రసన్నకుమార్, తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు సునీల్ నారంగ్, ఫెడరేషన్ అధ్యక్షుడు అనిల్ కలవగా, బాలకృష్ణ ఈ సన్మానానికి తన అంగీకారం తెలిపారు. బాలీవుడ్, ఇతర సినీ రంగాలకు చెందిన ప్రముఖులు కూడా ఈ సన్మాన సభకు హాజరవుతారని సమాచారం.

షూటింగ్ మొదలుపెట్టారు



విక్టరీ వెంకటేశ్, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న తాజా చిత్రం రెగ్యులర్ షూటింగ్ గురువారం మొదలైంది. వెంకటేశ్ సరసన మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేశ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఓ పోలీస్ ఆఫీసర్, ఆయన భార్య, మాజీ ప్రేయసి.. ఇలా మూడు పాత్రల చుట్టూ తిరిగే వినోద భరిత చిత్రమిదని, ఇందులో క్రైమ్ ఎలిమెంట్ కూడా మిళితమై ఉంటుందని దర్శకుడు అనిల్ రావిపూడి చెప్పారు. ప్రస్తుతం ప్రారంభమైన షూటింగ్‌లో చిత్రంలోని ముఖ్య తారాగణమంతా పాల్గొంటోంది. ఈ సినిమాను సంక్రాంతికి విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాత శిరీష్ చెప్పారు. దిల్ రాజు ఈ సినిమాకు సమర్పకుడు. ఈ చిత్రానికి సమీర్‌రెడ్డి ఛాయాగ్రాహకుడు, భీమ్స్ సిసిరోలియో సంగీత దర్శకుడు.

ఉత్తమ నటులుగా ఎన్టీఆర్, రామ్‌చరణ్ ఉత్తమ నటిగా సాయి పల్లవి

ఫిల్మ్‌ఫేర్ సౌత్ ఇండియన్ అవార్డుల సందడి





జాతీయ చలనచిత్ర అవార్డుల తర్వాత భారతీయ చిత్ర పరిశ్రమ ప్రతిష్ఠాత్మకంగా భావించే ఫిల్మ్‌ఫేర్ సౌత్ ఇండియన్ అవార్డులను గురువారం ప్రకటించారు. అంతర్జాతీయంగా ప్రతిష్ఠాత్మకమైన అవార్డులు పొందిన 'ఆర్ ఆర్ ఆర్' చిత్రం తెలుగు విభాగంలో ఉత్తమ చిత్రంగా ఎంపికైంది. ఉత్తమ నటులుగా ఎన్టీఆర్, రామ్‌చరణ్, ఉత్తమ దర్శకుడిగా రాజమౌళి ఎన్నికయ్యారు. 'విరాటపర్వం' చిత్రంలో నటించిన సాయిపల్లవి ఉత్తమ నటిగా ఎంపికయ్యారు. 'భీమ్లా నాయక్'లో నటించిన రానా ఉత్తమ సహాయ నటుడిగా, 'విరాటపర్వం'లో నటించిన నందితా దాస్, 'సీతారామం'లో నటించిన మృణాల్ ఠాకూర్ ఉత్తమ సహాయ నటీమణులుగా, ఉత్తమ గేయ రచయితగా సీతారామశాస్త్రి (సీతారామం) ఎన్నికయ్యారు. తమిళంలో ఉత్తమ నటుడిగా కమల్ హాసన్ (విక్రమ్) ఉత్తమ నటిగా ఊర్వశి, ఉత్తమ చిత్రంగా 'పొన్నియిన్ సెల్వం 1', ఆ సినిమాకు దర్శకత్వం వహించిన మణిరత్నం ఉత్తమ దర్శకుడిగా ఎన్నికయ్యారు. కన్నడంలో 'కాంతార', మలయాళంలో 'న్నా థాన్ కేసు కుడు' ఉత్తమ చిత్రాలుగా ఎన్నికయ్యాయి.

వినోదాత్మకంగా డార్లింగ్



అశ్విన్‌రామ్ దర్శకత్వం వహించిన చిత్రం 'డార్లింగ్'. ప్రియదర్శి నభానటేశ్ జంటగా నటించగా, కె.నిరంజన్‌రెడ్డి, చైతన్య నిర్మించారు. ఈ నెల 19న విడుదలవుతోంది. ఈ సందర్భంగా అశ్విన్‌రామ్ మీడియాతో ముచ్చటించారు. "కొత్త జంట పెళ్లిని ఎలా హ్యాండిల్ చేస్తారనేది ఇందులో వినోదాత్మకంగా చూపించా. సినిమాల ద్వారా సందేశాలు ఇవ్వడం నాకు ఇష్టం ఉండదు. ఈ సినిమాలో ఎంటర్టైన్‌మెంట్‌తో పాటూ ఓ సామాజిక బాధ్యతను కూడా జత చేశా. ఇందులో కథానాయకుడి పాత్ర చాలా అమాయకంగా.. కథానాయిక పాత్ర చలాకీగా ఉండాలి. అలా ఆ పాత్రలకి సరిపోయే నటీనటులను పరిశీలించాక.. ప్రియదర్శి, నభానటేశ్ వందశాతం సరిపోతారని అనిపించి వారిని తీసుకున్నాం. నభా పాత్రలో చాలా షేడ్స్ ఉంటాయి.. సినిమాలో నభా మీ అందరినీ పూర్తిగా ఆశ్చర్యానికి గురిచేస్తుంది. వినోదంతో పాటు భావోద్వేగాలని సమపాళ్లలో మిక్స్ చేసి తీసిన ఈ సినిమాలో.. హీరో హీరోయిన్ల మధ్యన వచ్చే సన్నివేశాలు అందరినీ కడుపుబ్బా నవ్విస్తాయి. నిర్మాతలు ఎక్కడా రాజీ పడకుండా మేకింగ్ విషయంలో పూర్తి స్వేచ్ఛనిచ్చారు.

అద్భుతమైన విజువల్స్‌తో..



వరుణ్ సందేశ్ నటిస్తున్న చిత్రం 'విరాజి'. ఆద్యంత్ హర్ష దర్శకత్వంలో మహేంద్రనాథ్ కూండ్ల నిర్మిస్తున్నారు. ఆగస్టు 2న సినిమా విడుదలవుతుంది. ఈ సినిమా ఫస్ట్ లుక్ టీజర్‌ను దర్శకుడు సాయి రాజేశ్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "టీజర్‌లో విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి. వరుణ్ లుక్ అదిరిపోయింది" అని చెప్పారు. "ఈ చిత్రం నాకు చాలా స్పెషల్" అని వరుణ్ సందేశ్ అన్నారు. "ఈ సినిమాలో చాలా ఆసక్తికరమైన అంశాలు ఉన్నాయి. వాటిని థియేటర్లలో చూసి ఆశ్చర్యపోతారు" అని దర్శకుడు ఆద్యంత్ హర్ష తెలిపారు.

ముందు రిసెప్షన్.. తర్వాత పెళ్లి!



వైవిధ్యమైన పాత్రలు పోషిస్తూ మంచి నటిగా తెలుగువారికి దగ్గరైన తమిళ నటి వరలక్ష్మి తన పెళ్లి వేడుకలోనూ వైవిధ్యం చూపించారు. వారం రోజుల క్రితం చెన్నైలో వరలక్ష్మి, నికోలై సచిదేవ్‌ల పెళ్లి రిసెప్షన్ చెన్నైలో జరిగింది. ఈ వేడుకకు పలువురు చిత్ర ప్రముఖులు హాజరయ్యారు. ఇలా అందరి అభినందనలు అందుకున్న వరలక్ష్మి, నికోలై సచిదేవ్ మంగళవారం థాయ్‌లాండ్‌లోని క్రాబి బీచ్ రిసార్ట్‌లో పెళ్లి చేసుకున్నారు. కుటుంబ సభ్యులు, అతికొద్దిమంది సన్నిహితుల మధ్య తమిళ సంప్రదాయానికి అనుగుణంగా ఈ పెళ్లి జరిగింది.

అనౌన్స్‌మెంట్ వీడియోతోనే సంచలనం



సత్యం రాజేశ్, బాలాదిత్య, గెటప్ శ్రీను ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన 'పొలిమేర 2' బాక్సాఫీస్ వద్ద ఊహించని సక్సెస్‌ను అందుకుని హారర్ థ్రిల్లర్ జానర్ సినిమాల్లో సరికొత్త ట్రెండ్ క్రియేట్ చేసిన సంగతి తెలిసిందే. 2021లో 'మా ఊరి పొలిమేర' చిత్రం ఓటీటీ సంస్థ 'డిస్నీ ప్లస్ హాట్‌స్టార్'లో విడుదలై అందరినీ మెప్పించింది. 'మా ఊరి పొలిమేర'కు సీక్వెల్‌గా వచ్చిందే 'పొలిమేర 2'. గతేడాది నవంబరులో విడుదలైన ఈ సక్సెస్‌ఫుల్ హారర్ థ్రిల్లర్ ఫిల్మ్‌కు కొనసాగింపుగా ఇంకో భాగం ఉంటుందని మేకర్స్ అప్పుడే ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించారు. తాజాగా, 'పొలిమేర 3'ను మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ వీడియో సంచలనం సృష్టిస్తోంది. ఈ వీడియో రిలీజైన కొద్దిసేపటికే ఎక్స్‌లో దేశవ్యాప్తంగా ట్రెండ్ అవుతూ టాప్ ప్లేస్‌ను ఆక్రమించింది. మూడో భాగాన్ని మొదటి రెండు పార్టులకు దర్శకత్వం వహించిన అనిల్ విశ్వనాథ్ తెరకెక్కించనున్నారు. భోగేంద్ర గుప్తా, వంశీ నందిపాటి సంయుక్తంగా నిర్మించనున్నారు. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనుల్లో ఉన్నట్లు మేకర్స్ వెల్లడించారు. 'పొలిమేర 3' లో సత్యం రాజేష్, బాలాదిత్య, కామాక్షి భాస్కర్ల, గెటప్ శ్రీను, రవి వర్మ, రాకేందు మౌళి, చిత్రం శ్రీను, సాహిత్య దాసరి ప్రధాన పాత్రల్లో నటించనున్నారు.


చంద్రబాబుకు అభివాదం చేస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు


ఎయిర్‌పోర్టు ప్రాంతానికి బస్సులో చేరుకుంటున్న ముఖ్యమంత్రి


సీఎంకు స్వాగతం పలుకుతున్న ఎస్పీ దీపిక


ఎయిర్‌పోర్టు నమూనాను పరిశీలిస్తున్న చంద్రబాబు


జీఎంఆర్ సంస్థ ప్రతినిధులను పలకరిస్తున్న చంద్రబాబు

భోగాపురంలో సీఎం చంద్రబాబు

గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు పనుల పరిశీలనకు సీఎం చంద్రబాబునాయుడు గురువారం భోగాపురం వచ్చారు. అధికారులతో సమీక్షకు ముందు పనుల ప్రగతిపై ఫొటో గ్యాలరీని, ఎయిర్‌పోర్టు నమూనాను పరిశీలించారు. సీఎం అయ్యాక జిల్లాకు తొలిసారి రావడంతో ఉమ్మడి జిల్లా మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు ఘన స్వాగతం పలికారు. టీడీపీ సీనియర్ నాయకులను చంద్రబాబు ఆప్యాయంగా పలకరించారు.


మాజీ మంత్రి పతివాడను పరామర్శిస్తున్న చంద్రబాబు


చంద్రబాబును కలిసిన సంధ్యారాణి


విజయచంద్ర


కళా వెంకటరావు


కోళ్ల లలితకుమారి


కోండ్రు మురళీ


జగదీశ్వరి


సువ్వాడ రవిశేఖర్


నాగమాధవి


నాగార్జున


బేబీనాయన

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వేపాడ: మండలంలోని జాకేరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా లో అంతరాయం కలుగుతుందని మండల విద్యుత్ శాఖ ఇంజినీర్ సూరిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోదారులు సహకరించాలని ఆయన కోరారు.

విజయనగరం రింగురోడ్డు: నగరంలోని అశోక్‌నగర్ 11 కేవీ, 33 కేవీ బాబామెట్ట పరిధిలో ఉన్న డబుల్ కాలనీ, కేంద్రీయ విద్యాలయం, ఏడుకోవెళ్ల, బాబామెట్ట ప్రాంతంలో చెట్టుకొమ్మలు తొలగించే క్రమంలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్‌శాఖ ఈఈ(ఆపరేషన్స్) విభాగం అధికారి పి.హరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

లక్కవరపుకోట: మండల కేంద్ర విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని ఎల్‌కేఎస్.పురం, గొల్జాం, కల్లెంపూడి, ముకుందపురం, పాటూరు, బొద్దాం, కొత్తబొద్దాం, ఓబలయ్యపాలెం గ్రామాలు, రామలింగాపురం సబ్ స్టేషన్ పరిధిలో కల్లేపల్లి, రేగ, పెదిరెడ్లపాలెం గ్రామాల్లో శుక్రవారం విద్యుత్‌కోత ఉంటుందని విజయనగరం రూరల్ ఈఈ జి.సురేష్‌బాబు తెలిపారు. ప్రజలు గమనించాలని కోరారు.

తాలూకా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఎన్నిక

కొత్తవలస: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తాలూకా అధ్యక్షునిగా కొత్తవలస సబ్ రిజస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న వై. తేజేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం సాయంత్రం కొత్తవలస సబ్ రిజస్ట్రార్ కార్యాలయంలో తాలూకా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఈ ఎన్నిక జరిగింది.

'గోస్తనీలో ఇసుకను అడ్డుకుంటున్నారు'

శృంగవరపుకోట: శృంగవరపుకోట మండల పరిధిలో ఉన్న గోస్తనీ నదీ పరివాహక ప్రాంతం నుంచి ఇసుకను తవ్వకోకుండా అడ్డుకుంటున్నారని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారికి నాటు బండ్లుతో ఇసుకను తరలించే రైతులు ఫిర్యాదు చేశారు. గురువారం శృంగవరపుకోట రైతు బజారులో రాయితీ కందిపప్పు ప్రారంభానికి వచ్చిన ఎమ్మెల్యేను వీరంతా కలిశారు. దీంతో అక్కడే ఉన్న తహసీల్దార్ కిరణ్‌కుమార్‌కు సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే సూచించారు.

విద్యార్థుల చదువుకు అండగా ప్రభుత్వం

జామి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం అండగా ఉంటుందని జామి మాజీ జడ్పీటీసీ సభ్యుడు బండారు పెదబాబు అన్నారు. గురువారం ఉన్నత పాఠశాల విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు.

16న మడ్డువలస నీరు విడుదల

వంగర: మడ్డువలస కుడి ప్రధాన కాలువ ద్వారా ఈ నెల 16న నీరు విడుదలకు సన్నాహాలు చేస్తున్నట్టు ఏఈ నితిన్ తెలిపారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'లో 'నీరు ఉన్నా విడుదల చేయలేదు' అనే శీర్షికన ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. కాలువలో నీరు విడుదల చేయనున్న నేపథ్యంలో రజకులు, ఇతర చేపల వృత్తుల వారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

మంచి వారికే చైర్మన్లుగా అవకాశం

శృంగవరపుకోట: తిరుమల తిరుపతి దేవస్థానం, ఇతర ప్రముఖ దేవాలయాలకు విలువలు కలిగిన వ్యక్తులను చైర్మన్లుగా నియమించాలని దక్షిణ భారతదేశ కాపు సంఘ రాష్ట్ర అధికార ప్రతినిధి ఒబ్బిన సన్యాసినాయుడు సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లను కోరారు. గతంలో వైసీపీ ప్రభుత్వం దొంగలు, దోపిడీదారులు, సీబీఐ, ఈడీ కేసుల్లో ముద్దాయిలను నియమించిందన్నారు.

కృత్రిమ అవయవాలు పంపిణీ

కొత్తవలస: మండలంలోని మంగళపాలెం గ్రామంలో ఉన్న గురుదేవ చారిటబుల్ ట్రస్టు ద్వారా ఉచితంగా కృత్రిమ అవయవాలను గురువారం దివ్యాంగులకు అందించారు. విజయనగరం, విశాఖపట్టణం, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, అనకాపల్లి, ప్రకాశం జిల్లా నుంచి 100 మంది దివ్యాంగులు హాజరయ్యారు. వీరికి కృత్రిమ అవయవాలతో పాటు కాలిపర్స్, మోటార్ ట్రైసైకిల్స్, వీల్ చైర్స్, చెవిటి మిషన్లు, ఉచితంగా అందజేశారు. కోల్‌కత్తాకు చెందిన ఎన్‌ఐఎల్‌డీ సంస్థవారి సహకారంతో వీటిని అందచేశామని ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు వి.ఫణీంద్ర, గురుదేవ ఆసుపత్రి బృందం పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనకు సహకరించాలి

బొబ్బిలి: బొబ్బిలి పట్టణానికి చెందిన పారిశ్రామికవేత్త చెలికాని వెంకట అచ్యుతరావు గురువారం కేంద్ర వాణిజ్య పరిశ్రమల మంత్రి టీజీ భరత్‌ను కలుసుకున్నారు. బొబ్బిలి ఏపీఐఐసీ గ్రోత్‌సెంటరులో పరిశ్రమల స్థాపనను ముమ్మరం చేయాలని, ఉత్తరాంధ్ర పారిశ్రామికాభివృద్ధి తదితర అంశాలపై దృష్టిసారించాలని మంత్రిని కోరినట్టు చెలికాని తెలిపారు.

అందుబాటు ధరల్లో నిత్యావసర సరుకులు

విజయనగరం రింగురోడ్డు: ప్రజలకు అందుబాటు ధరలకు నిత్యావసర సరుకులను అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే అదితి గజపతి రాజు తెలిపారు. జిల్లాలోని ఎనిమిది కేంద్రాల్లో బియ్యం, కందిపప్పులను విక్రయించేందుకు ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. గురువారం దాసన్నపేట, రైతుబజార్లలో బియ్యం, కందిపప్పు విక్రయ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్లో కందిపప్పు రూ.181 ఉండగా... ప్రభుత్వం ద్వారా ఇక్కడ రూ.160కి విక్రయిస్తున్నట్టు తెలిపారు. బియ్యం (సోనామసూరి) రెండు రకాలు కిలో రూ.48, 49 చొప్పున విక్రయిస్తున్నట్టు తెలిపారు. జాయింట్ కలెక్టరు కార్తీక్, మార్కెటింగ్ శాఖ ఏడీ రవికిరణ్, డీఎస్‌ఓ మధుసూధనరావు, రైతు బజారుల ఎస్టేట్ ఆఫీసర్లు పి.అప్పలనాయుడు, ఎల్.ఉమామహేశ్వరరావు, సీహెచ్ సతీష్, టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, ప్రసాదుల ప్రసాద్, కర్రోతు నర్సింగరావు, గంటా రవి, 5, 7వ డివిజన్ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


కందిపప్పు పంపిణీ చేస్తున్న అదితి

శృంగవరపుకోట: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం నిత్యవసర సరుకుల ధరలను తగ్గిస్తుందని శృంగవరపుకోట శాసన సభ్యురాలు కోళ్ల లలిత కుమారి అన్నారు. గురువారం స్థానిక రైతుబజారులో కిలో కందిపప్పు రూ.160కు, స్టీమ్డ్, పచ్చి బీపీటీ, సోనామసూరి కిలో రూ.49, రూ.48 రకాల బియ్యం విక్రయాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం పెంచిన నిత్యవసర సరుకుల ధరలను ఈ ప్రభుత్వం తగ్గిస్తోందన్నారు. తహసీల్దార్ కిరణ్ కుమార్, సీఎస్‌డీటీ శ్రీనివాస్, రైతు బజార్ ఎస్టేట్ అధికారి సురేష్, నాయకులు రెడ్డి వెంకన్న తదితరులున్నారు.

జగన్ సంస్కరణలు దుష్ఫలితాలిచ్చాయి

బొబ్బిలి: ముఖ్యమంత్రిగా జగన్ అమలు చేసిన సంస్కరణలు దుష్ఫలితాలిచ్చాయని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. తాజా మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు అధ్యక్షతన గురువారం సాయంత్రం స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజవకర్గ స్థాయి వైసీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చిన్న శీను మాట్లాడుతూ బటన్ నొక్కి జగన్ పాలన చేయాలనుకోలేదని, జనాలను ఆర్థికంగా బలోపేతం చేద్దామనుకున్నారన్నారు. ఈ ఫలితాలు కచ్చితంగా నిరాశ, నిస్పృహలను కలిగించాయనడంలో సందేహం లేదన్నారు. ప్రజలంతా సంతృప్తిగా ఉన్నారన్న భావనతో ధీమా పడ్డామన్నారు. మంచి విద్య వైద్యం, పథకాలు వంటివేవీ పట్టించుకోకుండామంచి మద్యానికే జనం ఓటు వేశారని మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. ఇదో వినూత్న తరహా ఓటమని, ఎప్పటిలా గనే మనమంతా కలిసికట్టుగా పనిచేద్దామని మాజీ ఎమ్మెల్యే శంబంగి పిలుపునిచ్చారు.


మాట్లాడుతున్న మజ్జి శ్రీనివాసరావు

తిరుపతికి సైకిల్‌యాత్ర

జామి: ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వం గెలవాలని, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా, విజయనగరం ఎమ్మెల్యేగా అదితి గెలవాలని విజయనగరం 50 వార్డుకు చెందిన తణుకు మోహనరావు తిరుపతి వేంకటేశ్వర స్వామిని మొక్కుకున్నారు. కోరిక తీరడంతో సదరు టీడీపీ వీరాభిమాని గురువారం విజయనగరంలో తన సైకిల్‌తో తిరుపతి యాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన జామి మండలం అలమండలో ఇలా కనిపించడంతో స్థానికులు ఆయనను అభినందించారు.


సైకిల్‌పై తిరుపతికి వెళ్తున్న తణుకు మోహనరావు

ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీ

విజయనగరం రింగురోడ్డు/రూరల్: ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకుని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గురువారం ఆ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. ముందుగా డీఎంహెచ్‌వో భాస్కరరావు జెండా ఊపి ప్రారంభించారు. జనాభా నియంత్రణ పద్ధతులు, నివారణ చర్యలపై నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ భాస్కరరావు మాట్లాడుతూ, పెరుగుతున్న ప్రపంచ జనాభా అనేక కొత్త సమస్యలు సృష్టిస్తుందన్నారు. పెరుగుతున్న జనాభా కారణంగా ప్రసూతి ఆరోగ్యం, కుటుంబ నియంత్రణకు సంబంధించిన సమస్యలు కలుగుతాయన్నారు. కుటుంబ నియంత్రణ, లింగ సమానత్వం, మాతృ ఆరోగ్య సేవలకు మహిళలకు ప్రాముఖ్యత వుండేలా చూసుకోవడం అవసరమన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టరు కె రాణి, ఎన్.సూర్యనారాయణ, జిల్లా టీకా నియంత్రణ అధికారి డాక్టరు అచ్యుతకుమారి, డెమో చినతల్లి, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు. రాకోడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో రాకోడులో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు. డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో

కొత్తవలస: ప్రపంచ జనాభా అవగాహన దినోత్సవ ర్యాలీని గురువారం వియ్యంపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించారు. వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధి కారులు గోపాలకృష్ణ, సింహాద్రినాయుడు, బీ ఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ అధిక జనాభా వలన విద్య, వైద్యం, పేదరికం, అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులు వస్తాయన్నారు. పర్యావరణ సమతుల్యం దెబ్బ తింటుందన్నారు. బాల్య వివాహాలు చెయొద్దని, సరైన సమయంలోనే వివాహాలు చేయాలని సూచన చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది నరసింహారావు, పద్మావతి, జగదాంబ,ఈశ్వరరావు, సత్యారావు, ఆప్తమాలిక్ అసిస్టెంట్ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేరొకరిది.. వాహనాలు మరొకరికి

- వైసీపీ ప్రభుత్వంలో దుస్థితి
- ఆరు నెలలుగా వాయిదాల చెల్లింపే లేదు
- కమిషనర్ మండిపాటు

రాజాం: పురపాలక సంఘం పరిధిలోని సెప్టిక్ ట్యాంకులను శుభ్రం చేయించడానికి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మూడు వాహనాలను మంజూరు చేశారు. ఎస్సీల పేరుతో మంజూరైన వాహనాలను వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు బీసీలకు కట్టబెట్టింది. ఒక్కొక్క వాహనం విలువ రూ.36 లక్షలు. కానీ ప్రభుత్వానికి రూ.18 లక్షలు మాత్రమే చెల్లించాలి. ఈ వాహనాలకు సంబంధించి ఒక్క నెల వాయిదా కూడా చెల్లించలేదు. వీటిని వారికి నచ్చిన విధంగా వాడుకోవడమే కాకుండా ప్రజల నుంచి అద్దెను ఇష్టానుసారంగా వసూలు చేస్తున్నారనే విమనర్శలు ఉన్నాయి. పురపాలక సంఘ పరిధిలో ఎవరిదైనా సెప్టిక్ ట్యాంకు నిండిపోతే... శుభ్రం చేయడానికి ట్యాంకుకు రూ.2500 వరకు వసూలు చేయాలని ప్రభుత్వం నిబంధనలు విధించినప్పటికీ.. దీనికి భిన్నంగా ట్యాంకుకు రూ.4వేల నుంచి రూ.4500 వరకు వసూలు చేస్తున్నట్టు తెలిసింది. ఈ సమాచారం తెలుసుకున్న కమిషనర్ రామప్పలనాయుడు గురువారం వారితో సమావేశం నిర్వహించారు. వాహనాలను ఇష్టానుసారంగా వాడుకోవడం సరికాదని హెచ్చరించారు. ప్రభుత్వానికి కట్టాల్సిన వాయిదాలను ఎందుకు చెల్లించడం లేదని కమిషనర్ ప్రశ్నించారు. అదనంగా వసూలు చేస్తున్న విషయంపైనా ప్రశ్నించారు. వాయిదాలను తక్షణమే చెల్లించాలని వాహనదారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఏఈ భాగ్యలక్ష్మి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చేగొండి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు చప్టాను పరిశీలించిన ఎమ్మెల్యే

బాడంగి: తెంటువలస గ్రామంలో గల గోపీనాథ్ పట్నాయకుని చెరువు చప్టాను ఎమ్మెల్యే బేబీనాయన గురువారం పరిశీలించారు. వర్షాకాలంలో వచ్చే వరద దాటికి చప్టా పై నుంచి నీరు బయటకు వచ్చి పంట పొలాలకు నష్టం కలుగుతోందని సర్పంచ్ తెంటు చిరంజీవిరావు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే బేబీనాయన.. మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మంనాయుడుతో కలిసి పరిశీలించి ఇరిగేషన్, రైల్వే ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి రైతులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.


చప్టాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన తదితరులు

టీడీపీ శ్రేణుల సంబరాలు

రాజాం: ఉచిత ఇసుక విధానం ప్రారంభం కావడంతో భవన నిర్మాణ కార్మికులు సంఘం, టీడీపీ నాయకులు శ్యాంపురం గ్రామంలో గురువారం సంబరాలు చేసుకున్నారు. కేక్ కట్ చేసిన అనంతరం కూటమి నేతల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. గత ప్రభుత్వ పాలనలో ఇసుక కొరతతో ఇబ్బందులు ఎదుర్కొన్నామని దీంతో గ్రామాల్లోని కూలీలు వలస బాట పట్టేవారని టీడీపీ నాయకులు బోర నారాయణరావు అన్నారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

చెరువులో పడి బాలుడి మృతి

- కంచరాంలో విషాదం

రాజాం, జూలై 11: మూడేళ్ల బాలుడు చెరువులో పడి మృతి చెందిన హృదయ విదార ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కంచరాంలో గొల్ల తవుడు పెయింటర్‌గా పని చేస్తున్నాడు. ఆయనకు భార్య నాగమణి, కుమారుడు నవదీప్(3), ఏడాది కుమార్తె భవ్యశ్రీ ఉన్నారు. నవదీప్ స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో పూర్వ ప్రాథమిక విద్య చదువుతున్నాడు. గురువారం అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లాడు. అక్కడి నుంచి ఇంటికి వచ్చిన తరువాత మధ్యాహ్నం తోటి స్నేహితులతో కలిసి గ్రామంలోని ఇద్దువాని చెరువు వైపు ఆడుకుంటూ వెళ్లాడు. అక్కడ చెరువులో పెద్ద గోతులు ఉండడంతో అందులో దిగి అదృశ్యమయ్యాడు. తోటి స్నేహితులు భయంతో కేకలు వేయడంతో పాటు స్థానికులకు సమాచారం అందించడంతో గ్రామస్థులు, కుటుంబసభ్యులు చెరువులో గాలింపు చర్యలు చేపట్టారు. బయటకు తీసి సపర్యలు చేపట్టినా అప్పటికే నవదీప్ మృతిచెందాడు. దీంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. దీంతో నిరుపేద కుటుంబంలో తీవ్ర విషాదం అలుముకుంది. అయితే ఈ ఘటనపై పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలుస్తోంది.


నవదీప్ (ఫైల్)

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

వీరఘట్టం: పురుగుమందు తాగి మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి వీరఘట్టం ఎస్‌ఐ ఫక్రుద్దీన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని యు.వెంకమ్మపేటకు చెందిన వాన రమణమ్మ(53) భర్త, ముగ్గురు కుమారులతో కలిసి నివసిస్తోంది. కుటుంబం ఆర్థికంగా చితికిపోవడం, ముగ్గురు కుమారులకు సరైన ఉపాధి లేకపోవడంతో వారి భవిష్యత్తుపై ఆందోళనతో జీవితంపై విరక్తి చెందింది. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం సుమారు ఆరు గంటల సమయంలో పొలాలకు వాడే గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు వెంటనే శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో చనిపోయింది. రెండో కుమారుడు సత్యంనాయుడు ఫిర్యాదుపై ఎస్‌ఐ ఫక్రుద్దీన్ కేసు నమోదు చేసి, పంచానామా జరిపించి, మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

చెరువులో పడి పశువుల కాపరి మృతి

బొబ్బిలి: పట్టణ పరిధిలోని గొల్లపల్లి శివారులో గల వెంగళరాయసాగర్ చెరువులో పడి పశువుల కాపరి మృతి చెందినట్లు ఎస్‌ఐ లోవరాజు తెలిపారు. మహారాణిపేటకు చెందిన పత్రి సన్యాసి(45) పసువుల కాపరిగా జీవనం సాగిస్తున్నాడు. గురువారం సాయంత్రం పశువులను మేతకు తీసుకెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తూ సన్యాసి చెరువులో పడిపోయినట్లు భావిస్తున్నారు. సన్యాసి ఇటీవల కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మృతుని భార్య వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహన్ని వెలికితీయించి స్థానిక సీహెచ్‌సీలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించామన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లోవరాజు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పార్వతీపురంటౌన్/ కొమరాడ: బొలెరో వాహనం, ఎండ్ల బండీ ఢీకొన్న ఘటనలో వ్యక్తికి గాయాలయ్యాయి. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. కొమరాడ మండలం కోటిపాం గ్రామానికి చెందిన పప్పల కోటేశ్వరరావు బుధవారం అర్ధరాత్రి తన గ్రామం నుంచి ఎండ్ల బండితో పార్వతీపురానికి ఇసుక తీసుకువస్తుండగా అదే మండలంలోని సోమినాయుడు వలస గ్రామం వద్ద ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ఢీకొంది. దీంతో ఎడ్ల బండిపై వస్తున్న కోటేశ్వరరావుకు తీవ్ర గాయాలవ్వడంతో 108 వాహనంలో జిల్లా ఆసుపత్రికి తరలించారు. కొమరాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మందు సీసాలు పగులగొట్ట వద్దు

తెర్లాం: మద్యం సేవించి, తాగేసిన సిసాలను పగలగొట్టవద్దని నందబలగ హైస్కూల్ ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు ఎం. విజయమోహన్ కోరారు. గురువారం ఆయన స్కూల్ పిల్లలతో దండోరాగా వెళ్లి ఆ గ్రామంలో డప్పు పట్టి మరీ అర్థించారు. ఈ సిసాలు, స్కూల్ పక్కన, పొలాలలో, ఊరు సమీపాన పడేయడంతో స్కూల్ పిల్లలకు గుచ్చు కుంటున్నాయని, పంట పొలాల్లో పనులు చేసుకోవడానికి వెళ్లే రైతులకు గుచ్చుకుని తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని డప్పు పట్టి విద్యార్థులతో కలసి ఆవేదన వ్యక్తం చేశారు.


పిల్లలతో కలసి నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

హీరాపంచమి వేడుకలు

బొబ్బిలి: పట్టణంలోని కంచరవీధి శ్రీ కల్యాణవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీజగన్నాథస్వామి మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో గురువారం హీరాపంచమి వేడుకలు జరుపుకున్నారు. బలభద్ర, సుబద్ర సమేత శ్రీ జగన్నాథస్వామి వార్లకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. సాయంత్రం సామూహిక విష్ణు సహస్ర నామార్చన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

బొబ్బిలి: ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్థానికులకు మున్సిపల్ కమీషనరు లాలం రామలక్ష్మి హితవు పలికారు. వార్డు పర్యటనలో భాగంగా గురువారం ఆమె సంగవీధిలో ఇంటింటి చెత్త సేకరణ పనులు, కాలువల డీసిల్టింగ్ పనులను పర్యవేక్షించారు.

బొబ్బిలి పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం

బొబ్బిలి: బొబ్బిలి పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం ఎన్నిక గురువారం స్థానిక ఎలిమ్ ప్రార్థనా మందిరంలో పాస్టర్స్ కె.కామేశ్వరరావు, పి.మోజెస్ ఆధ్వర్యంలో జరిగింది. గౌరవాధ్యక్షునిగా రావు సీతారామస్వామి (తిమోతి),అధ్యక్షునిగా ధనుంజయనాయుడు, ఉపాధ్యక్షులుగా ఆర్.నతానుయేల్, కార్యదర్శిగా పెంకి మోషే, బి.జాషువా, కోశాధికారిగా పి.తవిటినాయుడు ఎన్నికయ్యారు.

భారీ బందోబస్తు

- పాసులు ఉంటేనే ఎయిర్‌పోర్టు ప్రాంతంలోకి అనుమతి
- అన్ని రహదారులు పోలీసుల ఆధీనంలోనే
- అసంతృప్తితో వెనుదిరిగిన సీఎం అభిమానులు

భోగాపురం: ఎయిర్‌పోర్టు నిర్మాణ పనుల పరిశీలన సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గురువారం భోగాపుంర వచ్చారు. ఆయన వస్తున్నారని నాయకులు, కార్తకర్తలు, అభిమానులు, ప్రజలకు తెలియడంతో ఆయన్ను చూసేందుకు అనేక మంది బయలుదేరారు. అయితే పాసులు ఉన్నవారికే అనుమతించడంతో అభిమానులు నిరాశతో వెనుదిరిగారు. ఎయిర్‌పోర్టు నిర్మాణ ప్రాంతానికి వెళ్లే అన్ని రహదారులను పోలీసులు ఆధీనంలోకి తీసుకున్నారు. చంద్రబాబునాయుడు అనుకున్న సమయానికి గంట ఆలస్యంగా వచ్చారు. సుమారు 15 నిమిషాల పాటు ఏరియల్ సర్వే చేసి... అనంతరం విమానాశ్రయ నిర్మాణ ప్రాంతంలో దిగారు. అక్కడ పనుల పరిశీలన, సమీక్ష, అధికారులు, జీఎంఆర్ సంస్థతో చర్చలు, విలేకరుల సమావేశం అనంతరం సుమారు 3.30 గంటల తరువాత తిరుగు పయనమయ్యారు.


ఎయిర్‌పోర్టు నిర్మాణ ప్రాంతంలో ఎవరూ వెళ్లకుండా గేట్ ఏర్పాటు చేసిన దృశ్యం

తుపాకులు తిరిగివ్వండి

- అధికారులకు ఎస్టీ కులస్థుల మొర



మాట్లాడుతున్న ఎరుకలి కులస్థులు

చీపురుపల్లి: గత 2019 ఎన్నికలకు ముందు తమ నుంచి తాత్కాలికంగా స్వాధీనం చేసుకున్న లైసెన్సుడు (ఎస్బీఎంఎల్) తుపాకు లు తమకు తిరిగి ఇప్పించాలని జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన (ఎస్టీ) ఎరుకలి కులస్థులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. చీపురుపల్లి మండలంలోని కర్లాం, చిననడిపల్లి, పేరిపి, గరివిడి మండలంలోని చెందిన శేరీపేట, గుర్లలోని తెట్టంగి, కొత్తవలసలోని చింతదిమ్మెకు చెందిన పలువురు గురువారం చీపురుపల్లి ప్రెస్‌క్లబ్ వద్ద విలేకర్లతో మాట్లాడారు. జిల్లాలోని సుమా రు రెండు వేల మందికి పైగా లైసెన్సుడు తుపాకులు కలిగి ఉన్నామని, రాత్రి వేళ పంట పొలాలకు కాపలాగా ఉంటూ వాటి ద్వారా ఉపాధి పొందుతున్నామ ని తెలిపారు. అయితే, 2019 ఎన్నికలకు ముందు తమ వద్ద ఉన్న తుపాకులను నిబంధనల ప్రకారం ఆయా పోలీస్ స్టేషన్లలో డిపాజిట్ చేయించారని చెప్పారు. అయితే, ఆ ఎన్నికలు జరిగి ఐదేళ్లు దాటినా తమ తుపాకులు తమకు తిరిగి ఇవ్వలేదని వాపోయారు. నిబంధనలకు అనుగుణంగా రెన్యువల్ చేయాల్సి ఉంద ని, వాటిని తిరిగి తమకు అప్పగిస్తే రెన్యువల్ చేసుకుంటామని చెప్పారు. ఈ విషయంలో సంబంధిత పోలీస్ స్టేషన్లు, ఆర్డీవో కార్యాలయాలు, ఎస్పీ కార్యాల యం చుట్టూ గత ఐదేళ్లుగా తిరుగుతున్నా, తమ సమస్య పరిష్కారం కావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, తమ తుపాకులు తమకు ఇప్పించి, తమ ఉపాధిని పునరుద్ధరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గేదెల మహాలక్ష్మి, గొర్లె పోలయ్య, మహాలక్ష్మి, గేదెల ముత్యాలు, గొర్లె శ్రీను, పాలవలస త్రినాథ, దాసరి గాలి తాత తదితరులు పాల్గొన్నారు.

ఒంపల్లి క్వారీ పరిశీలన



పెదకొండను పరిశీలిస్తున్న మైన్స్ అధికారి

బొండపల్లి: ఒంపల్లి గ్రామంలో పెదకొండను అక్రమంగా తవ్వి గ్రావెల్ ను తరలిస్తున్న వాహనాల ను పట్టి కేసు నమోదు చేసిన విషయమై విజయ నగరం మైన్స్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ బండారు శ్రీనివాసరావు క్షేత్రస్థాయిలో తనిఖీచేశారు. గురువారం వీఆర్వో, గ్రామ సర్వేయర్లతో కొండ ప్రాంతానికి వెళ్లి తాత్కాలిక నివేదిక రూపొందించారు. గతంలో హరిత రహదారి నిర్మాణానికి అవసరమైన గ్రావెల్ కోసం గంట్యాడ, బొండపల్లి మండలాల సరిహద్దు అయిన ఈ ప్రాంతంలో మైన్స్ సంస్థ తాత్కాలిక అనుమతులు ఇచ్చిందని, అయితే ఇప్పు డు అదే కాంట్రాక్టర్ ఎన్‌కేసీ సంస్థకు గ్రావెల్ తరలింపునకు ఒప్పందం కుదుర్చు కుందని చెప్పారు. వీరు అక్రమంగా బొండపల్లి మండలం ఒంపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబరు 2లో అక్రమంగా తవ్వకాలు జరిపి, రవాణా చేసినట్లు మండల ఆర్ఐ సతీష్ ఫిర్యాదు మేరకు తహసీల్దార్ సమాచారం ఇవ్వడంతో పరిశీలనకు వచ్చామని శ్రీనవాసరావు తెలిపారు. ఈ నివేదికపై గ్రామ వీఆర్వో బి.ప్రసాద్, గ్రామ సర్వేయర్ మధులత నుంచి పూర్తి సమాచారం సేకరించారు.

నీటి అక్రమ కనెక్షన్లను తొలగించాలి

నెల్లిమర్ల: చినబూరాడపేట గ్రామస్థులు తాగునీటి కోసం గొట్లాం రక్షిత మంచి నీటి పథకం నుంచి గ్రామానికి వేసిన మెయిన్ పైపులైన్ నుంచి మార్గమ ధ్యంలో పలు వ్యాపార సంస్థలకు, దుకాణాలకు అక్రమంగా కొనసాగుతున్న నీటి కనెక్షన్లను తక్షణమే తొలగించాలని ఆ గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రామానికి చెందిన లోగిశ శ్రీను, కోట్ల శ్రీను, బి.శ్రీనివాసరావు, కె.లక్ష్మణ్ తదితరులు జిల్లా కలెక్టర్‌కు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ప్రతులను స్థానిక విలే కర్లకు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల దాహార్తిని తీర్చేం దుకు వేసిన పైప లైన్ నుంచి అక్రమంగా ఆర్‌డబ్ల్యూఎస్ ప్రాజెక్టు అధికారులు అక్రమంగా పలు దుకాణాలకు నీటి కనెక్షన్ ఇచ్చారని ఇది చట్ట విరుద్ధమని వారు తెలిపారు. తక్షణమే ఈ అక్రమ కనెక్షన్‌ను తొలగించాలన్నారు. అలాగే ఆర్‌డబ్ల్యూఎస్ ప్రాజెక్టు జేఈపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

నిరుద్యోగులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ

నెల్లిమర్ల: నిరుద్యోగ యువతీ యువకులు ప్రభుత్వం కల్పిస్తున్న నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమాలను వినియోగించుకోవాలని జిల్లా నైపుణ్యాభి వృద్ధి అధికారి డా.ఎన్.గోవిందరావు గురువారం ఒక ప్రకటనలో సూచించారు. విజయనగరం కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం, వీటీ అగ్రహారం బీసీ కాలనీ లోనూ రెండు నేక్ శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. 18 నుంచి 45 సంవత్సరాలు వయసు, కనీసం 8వ తరగతి విద్యార్హత ఉన్న ఆసక్తిగల అభ్యర్థులకు ఈనెల 9వ తేదీ నుంచి సుమారు 2 లేదా 3 నెలలు పాటు శిక్షణ ఇచ్చి, వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. వివరాలకు 9398286654 నెంబరుకు సంప్రదించాలని ఆయన సూచించారు. అసిస్టెంట్ సర్వేయర్, అసిస్టెంట్ ప్లంబర్ జనరల్, ఫీల్డ్ టెక్నీషియన్, ఎయిడ్ కండిషనర్, హెల్పర్, ఎలక్ట్రీషియన్, తదితర కోర్సులపై శిక్షణ ఉంటుందని తెలిపారు.

పశువులను రోడ్డుపై వదిలితే స్వాధీనం



సిబ్బందితో మాట్లాడుతున్న నగర పాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు

విజయనగరం రింగురోడ్డు: పశువు లను విచ్చలవిడిగా రోడ్లపై విడిచిపెడితే వాటిని స్వాధీనం చేసుకుని యాజమా నుల నుంచి అపరాధ రుసుం వసూలు చేస్తామని నగర పాలక సంస్థ కమిష నర్ ఎంఎం నాయు డు స్పష్టం చేశారు. గురువారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పర్యటన చేశారు. పారిశుధ్యం, కాలువల నిర్వహణ వంటి అంశాలను పరిశీలిం చారు. నీళ్లట్యాంకు జంక్షన్‌లో రహదారిపై విచ్చలవిడిగా రోడ్లపై పశువులు, వాటి వ్యర్థాలు దర్శనమివ్వడంతో పెంపకందారులను పిలిచి మందలించారు. ఇటువంటి చర్యలు పునరావృతమైతే, పశువులను స్వాధీనం చేసుకుంటామన్నారు. అనంతరం కొత్తపేట నీళ్ల ట్యాంకు వద్దకు చేరుకుని నీటి నమూనాలను పరిశీలించారు. ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేస్తున్నారా? లేదా అని పరిశీలించారు. ఈఈ కె.శ్రీనివాసరావు, కార్పొరేటర్ అల్లు చాణక్య, పారిశుధ్య పర్యవేక్షకులు రామకృష్ణ, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

డెంగ్యూపై అప్రమత్తంగా ఉండాలి

నెల్లిమర్ల: డెంగ్యూ దోమల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అర్బన్ మలేరియా అధికారి సురేష్ సూచించారు. డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక రామతీర్థం జంక్షన్ పాఠశాలలో ఆయన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నీటి నిల్వలు ఎక్కడా లేకుండా చూసుకోవాలని సూ చించారు. మలేరియా యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీలపై దృష్టి పెట్టాలి

శృంగవరపుకోట రూరల్: అంగన్‌వాడీ వ్యవస్థ నిర్వీర్యం కాకుండా కూటమి ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టాలనీ లోక్‌సత్తా పార్టీ జిల్లా కార్యదర్శి కె.ప్రసాద్ కోరారు. గురువారం ఆయన భవానీనగర్‌లో మాట్లాడుతూ ప్రీస్కూల్ పిల్లలను తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలలకు పంపుతున్నారని, దీనివల్ల అంగన్‌వాడీలకు వచ్చే చిన్నారుల సంఖ్య పడిపోయిందన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ప్రీ స్కూల్ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్చుకోవద్దని జీవో జారీ చేయాలని ఆయన కోరారు.

బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకాన్ని ప్రారంభించాలి

విజయనగరం దాసన్నపేట: ముఖ్యమంత్రి చంద్రబాబు దళిత విద్యార్థుల బెస్ట్ అవైలబుల్ పథకాన్ని ప్రారంభించాలని అంబేడ్కర్ రైట్స్ ఉత్తరాంధ్ర ప్రతినిధులు పొంద్రంకి వెంకటరమణ, గంటా వీర్రాజు కోరారు. ఈ మేరకు గురువారం జిల్లాకు విచ్చేసిన ముఖ్యమంత్రికి లేఖను పంపారు. దళిత సంక్షేమ పథకాలను తక్షణమే కొనసాగించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కాలా శ్రీశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే సంగతి!

- చీపురుపల్లి మండలంలోని రహదారుల్లో పెద్దపెద్ద మలుపులు
- తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా వైనం
- కానరాని హెచ్చరిక బోర్డులు, ప్రమాద సూచికలు



ఇటకర్లపల్లి వద్ద ఉన్న ప్రమాదకర మలుపు

చీపురుపల్లి: మండలంలోని చాలా రహదారులు ప్రమాదకర మలుపులతో భయం గొల్పేవిధంగా ఉన్నాయి. ఏమాత్రం ఆదమరిచినా ప్రాణాలు గాలిలో కలిసి పోక తప్పదు. చీపురుపల్లి నుంచి లావేరు వెళ్లే మార్గంలో విజయనగరం జిల్లా పరిధిలో పది కిలోమీటర్ల రహదారి ఉంది. ఈ పది కిలోమీటర్ల పరిధిలో దాదాపు 16 చోట్ల చాలా ప్రమాదకరకమైన మలుపులు ఉన్నాయి. మండలంలో ఉన్న మొత్తం బీటీ రోడ్ల పరిధిలో 48 చోట్ల మలుపులు ఉన్నాయంటే రోడ్ల పరిస్థితి ఏ రీతిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ రోడ్ల మలుపుల్లో తరచూ ప్రమాదాలు సంభవిస్తునే ఉంటాయి. పెదనడిపల్లి మీదుగా గొల్లలపాలెం, అటు పీకే పాలవలస, పేరిపి మీదుగా గొల్లలములగాం, ఇటు పర్ల, రామలింగపురం నుంచి విశ్వనాథపురం మీదుగా మెట్టపల్లి, కర్లాం గ్రామాలకు నిరంతరం ఆటోలు తిరుగుతూనే ఉంటాయి. వీటితో పాటు ద్విచక్రవాహనాలు కూడా ఈ రోడ్లలో అత్యంత వేగంగా వెళ్తుంటాయి. అయితే, ఈ రహదారుల్లో ఎక్కడా హెచ్చరిక బోర్డులు లేకపోవడం విశేషం. ఇటీవల నాగంపేట వద్ద పోలీసులు హెచ్చరిక బోర్డులు ఏర్పాట చేసినా, రోడ్లు భవనాల శాఖ మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. కాగా, ఈ మలుపులపై ప్రజా ప్రతినిధులంతా ముక్త కంఠంతో మండల సమావేశాల్లో ఎన్నిమార్లు అరిచి గగ్గోలు పెట్టినా పట్టించుకునే వారే కరువయ్యారు. ఇప్పటికైనా, మలుపుల వద్ద ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

విద్యాశాఖ పనితీరుపై సభ్యుల ధ్వజం

- రామభద్రపురం మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మణరావు

రామభద్రపురం: మండలంలో విద్యాశాఖ పనితీరు అస్తవ్యస్తంగా ఉందని సభ్యులు మూకుమ్మడిగా ధ్వజమెత్తారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యా లయంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మామిడివలస ఎంపీటీసీ మడక తిరుపతినాయుడు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులను అగౌరవపరిచే విధంగా విద్యా శాఖాధికారులు వ్యవహరించడం దారుణమన్నారు. ఇటీవల స్థానిక జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు కిట్లు పంపిణీలో ప్రజాప్రతినిధులకు ఏమాత్రం గౌరవం ఇవ్వకుండా విద్యాశాఖ వ్యవహరించిందని ఆరోపించారు. మిర్తివలసలో మూడేళ్ల నుంచి సబ్జెక్టు టీచర్ లేకపోవడంతో నాణ్యమైన విద్య ఎలా అందుతుందని సర్పంచ్ మజ్జి రాంబాబు ప్రశ్నించారు. మూలశెలగాం పాఠశాల శిథిలావస్థకు చేరుకోవడంతో 20 మంది విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారని రావివలస సర్పంచ్ కురిడి కుమారి తెలిపారు. మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 1200 మంది ఉన్న సంఖ్య ఒక్కసారిగా 800కు పడిపోవడం ఆందోళన కలిగిస్తోందని ఎంపీపీ లక్ష్మణరావు అన్నారు. ఆ పాఠశాలలో ఉపాధ్యాయుల మధ్య ఉన్న గ్రూపులే దీనికి కారణమని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మండలంలో విద్యావ్యవస్థను మెరుగుపరచాలని సభ్యులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని జగనన్న కాలనీలో అవకతవకలు జరుగుతున్నాయని, వీటిని నిరోధించడంలో అధికారులు ఘోరంగా విఫలం చెందారని రామభద్రపురం సర్పంచ్ రవ్వా ఈశ్వర రావు సభ దృష్టికి తెచ్చారు. ఎంపీటీసీ భవిరెడ్డి చంద్ర మాట్లాడుతూ రామభద్రపు రం అంగన్‌వాడీ భవనం పూర్తయినా కాంట్రాక్టర్ భవనాన్ని అప్పగించేందుకు నిరాకరించడంపై అధికారులను ప్రశ్నించారు. పాతరేగలో ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ ప్రతినిధి పైడిపునాయుడు కోరారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, ఎంపీడీవో చుక్క ఈశ్వరమ్మ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

చీపురుపల్లి: చీపురుపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికిగాను గెస్ట్ లెక్చరర్లుగా పనిచేయడానికి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డా.వీవీ కృష్ణాజీ ఒక ప్రకటనలో తెలిపారు. గణితం, భౌతిక, రసాయన శాస్త్రం, కంప్యూటర్ సైన్సు, జువాలజీ సబ్జెక్టుల్లో ఖాళీలు ఉన్నాయని చెప్పారు. ఆసక్తి ఉన్నవారు సంబంధిత సబ్జెక్టుల్లో కనీసం 55 శాతం మార్కులతో పీజీ పూర్తి చేసి ఉండాలని తెలిపారు. దీంతోపాటు ఎన్‌ఈటీ/ఎస్ఎల్ఈటీ వంటి అదనపు అర్హతలు ఉండాలన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు ఈనెల 26లోగా తమ దరఖాస్తులను కళాశాల కార్యాలయంలో సమర్పించాలని ఆయన కోరారు. ఇతర సమాచారం కోసం కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

గంట్లాంలో 'జనంలోకి మనం'

డెంకాడ: గంట్లాం గ్రామంలో గురువారం తపాలా శాఖ ఆధ్వర్యంలో జనంలోకి మనం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా భోగాపురం తపాలా కార్యాలయం పరిధిలోగల పోస్టుమాస్టర్లతో పోస్టల్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తపాలా శాఖలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బాల బాలికల కోసం సుకన్య సమృద్ధి యోజన పథకం, వృద్ధులకు గ్రామీణా తపాలా బీమా పథకంపై వివరించారు. ఈ కార్యక్రమంలో భోగాపురం, పూసపాటిరేగ, డెంకాడ పరిధిలోగల బ్రాంచ్ పోస్టు మాస్టర్లు, తపాలా కార్యాలయ సిబ్బంది, అసిస్టెంట్ సూపరింటెండెంట్ సుందర్‌నాయుడు పాల్గొన్నారు.

చురుగ్గా పెద్దగెడ్డ పనులు

రామభద్రపురం: జన్నివలస గ్రామంలో పెద్దగెడ్డ కాలువ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. మండలానికి సుమారు 3 వేల ఎకరాలకు సాగునీరు అందించాలన్న ఉద్దేశంతో జన్నివలస, తారాపురం, కొట్టక్కి గ్రామాలకు సంబంధించి కాలువ నిర్మాణం చేపట్టారు. గత అయిదేళ్లుగా ఈ కాలువలో పూడికలు తీయకపోవడంతో పిచ్చిమొక్కలతో నిండిపోయి సాగునీరు రాని పరిస్థితి నెలకొంది. ఆ ప్రాంత రైతులు ఇటీవల బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయనకు సమస్యను వివరించడంతో ఆయన సొంత నిధులు వెచ్చించి యంత్రాలతో పూడికతీత పనులు చేపట్టారు. దీంతో స్థానిక టీడీపీ నాయకులు ముల్లు రాంబాబు, బెవర సీతారాం, పత్తిగుళ్ల యోగినాయుడు, సత్యంనాయుడు తదితరులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పాడిరైతులు పశుగ్రాసాన్ని సాగుచేయాలి

- పశు సంవర్థక శాఖ జిల్లా అధికారి రమణ



పశుగ్రాస విత్తనాలను పంపిణీ చేస్తున్న రమణ

నెల్లిమర్ల: ప్రతి పాడి రైతు తన అవకాశం మేరకు కనీసం 25 సెంట్ల భూమిలో పశుగ్రాసాన్ని సాగు చేసుకోవాలని జిల్లా పశుసం వర్థక శాఖ అధికారి డాక్టర్ వైవీ రమణ అన్నారు. పశుగ్రాస వారోత్సవాల సందర్భంగా మండలంలోని అలుగోలు రైతు సేవా కేంద్రంలో గురువారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. పశు గ్రాస పెంపకంతో పాల ఉత్పత్తి ఖర్చును తగ్గించుకోవచ్చని అన్నారు. ప్రభుత్వం 75 శాతం రాయితీపై అందించిన మేలు రకపు జొన్నగడ్డి విత్తనాలను రైతులకు పంపిణీ చేసినట్టు తెలిపారు. గ్రామంలోని పలువురి రైతుల పశుగ్రాస క్షేత్రాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సహాయ సంచాలకుడు డా.జి.చక్రవర్తి, సతివాడ పశువైద్యాధికారి డా.ప్రవీణ్‌కుమార్, వైస్ ఎంపీపీ సారికి వైకుంఠంనాయుడు, టీడీపీ నాయకులు కరిమినేని దివాకర్, అల్తి బాబూరావు, సిబ్బంది పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చినందుకు అభినందనలు

విజయనగరం దాసన్నపేట: కూటమి ప్రభుత్వం ఏర్పాడ్డాక ఇచ్చిన హామీలు నెరవేర్చినందుకు అభినందనలు తెలుపుతున్నట్టు జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గదుల వెంకటరావు అన్నారు. స్థానిక జిల్లా సంఘ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పాలకుల విచ్ఛిన్నకర రాజకీయాలతో నష్టపోయిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు కూటమి నేతలు చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘ నాయకులు చోడి ఆదినారాయణ, వేణు, లక్ష్మారెడ్డి, పైడిరాజు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉండాలి



భోజనం వడ్డిస్తున్న డిప్యూటీ డీఈవో కేవీ రమణ

భోగాపురం: మధ్యాహ్న భోజనం సుచిగా, రుచికరంగా ఉండాలని డిప్యూటీ డీఈవో కేవీ రమణ ఉపాధ్యాయులకు సూచించారు. భోగాపురం ఆదర్శ పాఠశాల, ముక్కాం, రామచంద్రపేట ఉన్నత పాఠశాలలను ఆయన గురువారం సందర్శిం చారు. ఈసందర్భంగా పాఠశాల పరిశుభ్రత, స్టూడెంట్ కిట్ల పంపిణీ, విద్యార్థుల హాజరు, ఎండీఎం నిర్వాహణ, ప్రవేశాలు, తదితర రికార్డులు పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఎంఈవో ఎం.రమణమూర్తి, ఎంఈవో2 బి.చంద్రమౌళి, ప్రిన్సిపాల్ సి.పార్వతి, హెచ్ఎంలు జి.నరిశింగరావు, వై.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


వల్లాపురం పాఠశాల సందర్శన

గుర్ల: వల్లాపురం జడ్పీ ఉన్నత పాఠశాలను ఎంఈవో శ్రీనివాసరావు గురువారం ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకున్నారు. సైన్స్ ల్యాబ్‌ను, నూతనంగా ఏర్పాటు చేస్తున్న తరగతి గదులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతోపాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడం, మొక్కలు పెంచడం తెలియజేయాలన్నారు. ఆయన వెంట పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెనూ అమలు చేయాలి

వేపాడ: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని మెనూ ప్రకారం అమలు చేయాలని ఎంఈవో పి.బాలభాస్కరరావు అన్నారు. దబ్బిరాజుపేట ఎంపీపీ పాఠశాలను ఆయన గురువారం సందర్శించారు. పరిసరాల పరిశుభ్రతపై శ్రద్ధ చూపాలన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని మెనూ ప్రకారం అమలు చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రెడ్డి శంకరరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఓబులయ్యపాలెంలో కొనసాగుతున్న వైద్య శిబిరం



వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

వేపాడ: ఓబులయ్యపాలెం గ్రామంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న ప్రత్యేక వైద్యశిబిరం గురువారం కూడా కొనసాగించారు. గ్రామంలో గత కొన్ని రోజులుగా జ్వరాలు విజృంభించడంతో పలువురు మంచం పట్టిన విషయం తెలిసిందే. దీనిపై పత్రికల్లో వచ్చిన కథనాలకు స్పందించిన బొద్దాం పీహెచ్‌సీ వైద్యాధికారి రమాదేవి ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి బాధితులకు వైద్య సేవలు అందిస్తున్నారు. గురువారం 16 మందికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ శిబిరంలో ఆసుపత్రి హెచ్ఎస్ మూర్తి, హెల్త్ అసిస్టెంట్లు శేఖర్, వెంకటరావు, దాలినాయుడు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

ఎల్.కోట నోడల్ అధికారిగా డీఈవో

లక్కవరపుకోట: ఎల్.కోట మండల నోడల్ అధికారిగా జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమకుమార్‌ను నియమించినట్లు ఎంపీడీవో కె.రూపేష్ తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో మండల అధికారులు పని చేయాల్సి ఉంటుందన్నారు.

గంట్యాడ వద్ద టోల్ గేట్

గంట్యాడ: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కొత్తగా విస్తరించిన జాతీయ గ్రీన్‌ఫీల్డ్ రహదారికి(516ఈ) సంబంధించి గంట్యాడ కొర్లాం గ్రామం వద్ద టోల్‌గేట్ ఏర్పాటు చేశారు. దీనిని మరి కొద్ది రోజుల్లో ప్రారంభించనున్నారు. ఇప్పటికే కేంద్ర రవాణా మంత్రిత్వ శాఖ వాహనాలపై చార్జీల వసూళ్లపై విధి విధానాలు జారీ చేసింది.

ఎస్సీ సామాజిక భవనాన్ని పూర్తి చేయండి

చీపురుపల్లి: పట్టణంలో పోలీస్‌స్టేషన్ ఎదురుగా చేపట్టిన ఎస్సీ సామాజిక భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని సర్పంచ్ మంగళగిరి సుధారాణి, నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు కోరారు. రూ.10లక్షల జడ్పీ నిధులతో నిర్మించతలపెట్టిన ఈ భవనాన్ని వారు గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ సామాజిక భవనం వద్ద తాగు నీటి బోరు వంటి ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

డెంకాడ: అక్కివరం సబ్‌స్టేషన్ పరిధిలోగల గ్రామాలకు శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ నిలుపుదల చేస్తామని డెంకాడ విద్యుత్ శాఖాధికారి పి.రామ్మూర్తి తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. బంటుపల్లి, గంట్లాం, పేడాడ, రాజులతమ్మాపురం, గొలగాం, బెల్లాం, చిట్టిగుంకలాం, తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని చెప్పారు.

లైంగిక వేధింపులకు పాల్పడితే చర్యలు

రేగిడి: పనిప్రదేశంలో మహిళలపై లైంగిక దాడులకు, వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవదని తహసీల్దార్ జె.రాములమ్మ, ఎంపీడీవో శ్యామలాకుమారి పేర్కొన్నారు. మహిళలపై లైంగిక వేధింపుల చట్టం-2013 పై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రాజాం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఈవోఆర్డీ సత్యనారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు బంగారమ్మ, అమ్మనమ్మ, శశికళ పాల్గొన్నారు.

లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న లక్ష్మీదేవి

విజయనగరం రూరల్: రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా గురువారం శీలవిరుపు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా లక్ష్మీదేవీకి ప్రత్యేక పూజలు చేశారు. నగరంలోని మన్నార్ రాజగోపాలస్వామి ఆలయం, ఉల్లివీధి కాళ్ల నాయుడు మందిరం రోడ్డులో, చిక్కాల వీధి, దాసన్నపేటలోని, సంతపేటలోని జగన్నాథ స్వామి ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు.

బీజేపీ అభివృద్ధే లక్ష్యం

గుర్ల: బీజేపీని అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని పార్టీ విజయనగరం పార్లమెంట్ కన్వీనర్ శంబర లక్ష్మీనరసింహ అన్నారు. గురువారం గుర్లలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ నాయకులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలపాటి రాజేష్ వర్మ పాల్గొన్నారు. నియోజకవర్గంలో బీజేపీని అభివృద్ధి చేసే దిశగా అడుగులు వేయాలన్నారు. పార్టీ నాయకులు ఎస్‌వీఎల్ఎన్.రాజు, ఇప్పిలి నీలకంఠం, వెంకటరావు, ఎస్‌వీ రమణరాజు, ప్రదీప్ పాల్గొన్నారు.